# సాదాబల్బూ - ట్యూబులైటూ

ఎలక్ట్రిక్ బల్బు స్విచ్చి వేయగానే టపీమని వెలుగుతుంది. ట్యూబులైట్లు మటుకు వెలగనా మాననా అని కాసే పాలోచించి, ఊరించి. 'గీఁ' శబ్దంతోసహా 'సరే వెలుగుదాం' అనుకొని వెలుగుతుంది. బండీవాడు ఎద్దుని తోలటానికి తోక నులిమేటట్టు 'స్టార్టర్' అంటూ చిన్న పరికరం ఉంటేగాని ట్యూబ్‌లైటు అసలు వెలగదు. 'చోక్' ఉంటేగాని పనేచెయ్యదు. మామూలు బల్బు కివేమీ అక్కర్లేదు. పగలంత వెలుగిచ్చే ఆర్భాటానికి పోదు.

నా మిత్రకోటిలోని రామారావు తలకాయ మామూలు బల్బులాంటిదైతే రంగారావుది ట్యూబులైటు లాంటిదని సుబ్బారావుతో అన్నాను ఒకసారి.

రంగారావు అంత కలవాడు కాకపోయినా, రామారావుకి గొప్ప కథకుడుగా ఉన్న పేరు ప్రతిష్టలతో రంగారావు కన్ను కుట్టింది. రంగారావూ ఓపాటి కథలు ఉత్పత్తి చేస్తున్నవాడే. డజను కథలు పుస్తకంగా వేసి, అందరికీ పంచిపెట్టాడు. అంతా ఆకాశాని కెత్తుతున్న తన ఇటీవలి నవల ప్రతులు చివరికి నాకైనా ఒక టిచ్చుకోటానికి రామారావు దగ్గరలేవు,

''నోరారా అడిగితే గాని, కాపీ ఇవ్వవు, ఏం ?'' అన్నాడు సుబ్బారావు.

"నువ్వడక్కుండానే మీ అమ్మ నీకు తిండిపెట్టిందా?'' అన్నాడు రామారావు.

''ఏంతెలివి, స్నేహితులు కూడా అడుక్కోవాలి! అడక్కుండా నేను రెండేసి కాపీలిచ్చుకోలా ?'' అన్నాడు రంగారావు, ట్యూబులైటు!

"అడిగావు గనక నీకు తప్పకండా ఒక కాపీకొని తెచ్చి ఇస్తాను, అయితే ఒక షరతు. ''నన్ను నీయింటికి పిలిచి, నీ పెళ్ళాంచేత దివ్యమైన వంటచేయించి, భోజనం పెట్టు, ఇంత పప్పన్నం. ఇంత పరమాన్నం— ''

"ఇంత గడ్డీ గాదరా" - ట్యూబులైటు సంకోచిస్తూ వెలిగింది.

"ఒరే రంగా! నన్ను తిండికి పిలిచి, నా క్కావలసినవేవో పెట్టమంటున్నాను గాని, నీ క్కావలసినవి కాదు. నా గొడవేదో అయినాక, నువు చెప్పుకుందువుగాని. లేదూ, నువే ముం దేడుస్తానంటావూ, చెప్పు. గడ్డీ, గాదరా, ఇంకా ఏం కోరికలు ?" అన్నాడు రామారావు - సాదాబల్బు.

ట్యూబులైటుకున్న ఛోక్ ఆయుర్దాయం తీరింది. స్టార్టర్ పసయిపోయింది.

నేను సుబ్బారావు కళ్ళల్లోకి చూశాను. నా చూపులో తన క్కావలసిన సమాధానం దొరికిం దనటానికి వాడి చిరునవ్వే చాల్ను.

'శేఖర్ బాబు'